మినీ కథలు

## మార్గం

"సృజన్"

'ఎక్కడికెళ్తున్నారు?'

ఆగాడు...

'ఏమిటి అలా ఉన్నారు?'

మౌనం.

'మీరేదో విషయంతో బాధపడుతున్నట్టున్నారు?'

నిర్లక్ష్యం...

'మీరా సేట్‌కు అప్పుపడ్డారట!?... మరి, విపరీతమైన అధిక ధరలు మనల్ని అలా చేస్తున్నాయి. 'వడ్డీకి' మన బతుకు 'సరి' అంటాడు కదా?'

ఏవో చూపులు.

'మీ యింటికి సేట్ రావడం పోతూ పోతూ నేను చూశానులెండి. కాని మీరా సమయంతో ఇంట్లో ఉన్నారా?'

తల అడ్డంగా ఊగింది— 'నే వెళ్ళేసరికి పగిలిన గాజులకింద మా అమ్మాయి..'

'ఆఁ! అలాగా!' పళ్ళుకొరికాను... 'అరే! ఏమిటి మీ చేతిలో ఏదో ఉందే?'

జీవంలేని నవ్వు

'అదేంటి ఎర్రగా రక్తం అంటినట్టూ?'

ముఖంలో తృప్తి...

'...పోలీసులున్నట్టున్నారు... మనవైపే వస్తున్నట్టున్నారు. పదండి పోదాం.'

నిర్ణయం...

'మీరు వెళ్లాల్సింది కటకటాలకు కాదు. ఆలాంటి ఎంతో మంది సేట్లకు బుద్ధి చెప్పాలి. పదండి పోదాం తూర్పుదిక్కు..

అనుసరించాడు.

## హింస

టి. మాన్

చేతి మీద దోమ వాలింది. విదిలించా. వెంటనే ఎగిరిపోయింది (అహింసా పరమో ధర్మః) రెండోసారి రెండోచేతిని కుట్టినప్పుడూ విదిలించి చూసా. మళ్ళీ ఎగిరిపోయింది. పుస్తకం చదవటాన్ని కొనసాగిస్తూండగా కాలిమీద ఏదో కుడుతున్నట్లనిపిస్తే చూసా. ఆ దోమే దీక్షగా నా రక్తాన్ని పీల్చుకొంటోంది, పుస్తకాన్ని అవతల పడేసి ఒక్కసారి ఆ దోమని రెండు చేతులమధ్యకి వచ్చేటట్టుచూసి నలిపేసా. నేనూ ఒక ప్రాణిని చంపేసా. నేనో హంతకుణ్ణి అని ఇంకోదోమ అంది. "అహింసయే పరమో ధర్మః"— అంది నా కాలిమీద దద్దురు.

740